
క్లుప్తంగా

ప్రసన్న వెంకన్నకు పూజలు


విశేషాలంకరణలో వెంకన్న

బుచ్చినాయుడు కండ్రిగ: మండలకేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. శనివారం కావడంతో భక్తులు భారీసంఖ్యలో హాజరయ్యారు. శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. గ్రామస్తులు, భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్తులు, భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. భారీస్థాయిలో భక్తులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలో పూడికతీత


పూడిక తీత పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్ ఆధ్వర్యంలో శనివారం మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారాలను తొలగించి పూడికతీత పనులు చేపట్టారు. ఇటీవల స్థానిక గ్రామాల ప్రజలు డయేరియా తదితర వ్యాధులు సోకి ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయం తెలిసి సర్పంచ్ తన గ్రామంలో అక్కడక్కడ కాలువల్లో నిలిచిపోయిన మురుగు, చెత్తాచెదారాలను తొలగించారు. డయేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న శనీశ్వరస్వామి వారికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభి షేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కిడ్నాప్ కేసులో నిందితులకు రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

శ్రీకాళహస్తి: తిరుపతికి చెందిన కృష్ణమూర్తి అనే ఎన్ఆర్ఐని కిడ్నాప్ చేసిన ఘటనలో ఆయేషా అనే యువతితో పాటు మరో ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రారాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. తిరుపతికి చెందిన కృష్ణమూర్తి అనే ఎన్ఆర్ఐకి అదే నగరానికి చెందిన ఆయేషాతో పరిచయం ఏర్పడింది. ఆయన పనిచేస్తున్న సంస్థలో కొందరు మహిళలను సభ్యులుగా చేర్పిస్తానని ఆయేషా చెప్పడంతో కృష్ణమూర్తి ఆమెతో పాటు గత 3వ తేదీన శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌కు చేరుకున్నారు. ముందుగా ఆమె రూపొందించుకున్న పథకం ప్రకారం కృష్ణమూర్తి కంట్లో కారం కొట్టి కిడ్నాప్ చేసి రూ.5 లక్షలు వసూలు చేశారు. కుటుంబసభ్యులకు ఫోన్ చేసి రూ.6 కోట్లు డిమాండ్ చేశారు. అయితే ఫలితం లేకపోవడంతో 4వ తేదీ కృష్ణమూర్తిని రాజీవ్‌నగర్ వద్ద వదలివెళ్లారు. ఆయన 8వ తేదీ శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు విచారణ చేపట్టి ఆయేషాతో పాటు న్యామత్, రామచంద్రారెడ్డి, వడ్లపూడి దాము, బంజల లోకేష్, పిడతల గిరి, యాసారపు భార్గవ్, వెట్టి అనిల్ అనే యువకులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

అడవిలో వ్యక్తి ఆత్మహత్య

సత్యవేడు: మండలంలోని మదనంబేడు అటవీ ప్రాంతంలో ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సత్యవేడు–ఊత్తుకోట మార్గంలోని సిరుణంబూదూరు గ్రామానికి తాగునీటి సరఫరా చేసే పంపింగ్ హౌస్ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వ్యక్తి ఉరి వేసుకుని చనిపోయి ఉండడాన్ని గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శరీరం కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా మారింది. మృతుడు ఉరి వేసుకుని నెల రోజులై ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఉరి వేసుకున్న వ్యక్తి తెలుపు చొక్కా ధరించి ఉన్నారు. పోలీసులు విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కబళిస్తున్న కాలుష్యం..
ప్రాణాలకు లేదు అభయం

పారిశ్రామిక పట్టణం రేణిగుంటను కాలుష్యం కబలిస్తోంది. వాయు, నీరు కలుషితం అవుతున్నాయి. ఈ పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారుల ఊసేలేదు. ఫలితంగా ప్రజల ప్రాణానికి అభయం లేకుండా పోయింది.

- కాలుష్యాన్ని వెదజల్లుతున్న కర్మాగారాలు
- గ్రామీణ ప్రజలపై చిమ్ముతున్న రసాయన విషం
- పట్టించుకోని అధికారగణం


ఫ్యాక్టరీ బయట కాలువలో పారుతున్న రసాయన వ్యర్థాలు


ఓ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగ


రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఓ పరిశ్రమ నుంచి విడుదల చేస్తున్న రసాయనపూరిత నీరు

రేణిగుంట: ''పారిశ్రామిక కేంద్రంగా పరిఢవిల్లుతున్న రేణిగుంటలో కాలుష్యానికి కొదవలేదు. రేణిగుంట, గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న కర్మాగారాల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలు ప్రజలను అనారోగ్యంపాలు చేస్తున్నాయి. కర్మాగార యాజమాన్యాలు నిర్దేశిత ప్రమాణాలు పాటించకున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పరిశ్రమల కాలుష్యాన్ని భరించలేని సమీప గ్రామాల ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో కాలుష్యాన్ని పీలుస్తూ బతుకుతున్నారు.''

సుమారు 200 పరిశ్రమలు

ప్రధానంగా రేణిగుంట, గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సుమారు 200 వరకు కుటీర, మధ్య తరగతి పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో 30 వేల మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. రేణిగుంట–తిరుపతి మార్గంలో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలను కరిగించే పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. అలాగే గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కెమికల్ కర్మాగారాలు అధికంగా ఉన్నాయి. అయితే నిర్దేశిత ప్రమాణాలను పాటించి నడుస్తున్న కర్మాగారాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. దాదాపు అన్ని కర్మాగారాలు ఏదో ఒక రూపంలో కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. కొన్ని కర్మాగారాలు పొగ గొట్టాల ద్వారా నిత్యం రసాయన పొగను గాల్లోకి కలుస్తున్నాయి. మరికొంతమంది గుట్టు చప్పుడు కాకుండా రసాయన వ్యర్థ జలాలను కాలువల ద్వారా బయటికి వదిలేస్తున్నారు. అవి భూగర్భజలాల్లో కలసి సమీప గ్రామాల పంట పొలాలు సాగుకు దూరంగా ఉంటున్నాయి. గాజులమండ్యం ఎస్టేట్ వ్యర్థాలు నక్కలవంక వాగులో కలవడం ద్వారా రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని సుమారు పది గ్రామాల ప్రజలు వినియోగించే సాగు, తాగునీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నారు. ఇక్కడి భూములు సాగుకు పనికిరావని భూసార పరీక్ష నిపుణులు తేల్చేశారు. అనేకసార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉద్యమాలు చేశారు. అయినా సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు.

కనీస వేతనాలేవీ?

కర్మాగారాల్లో పనిచేస్తున్న వారిలో స్థానికేతలే ఎక్కువగా ఉన్నారు. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బిహార్, పూనే, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు ఇస్తున్నారో? లేదో పర్యవేక్షించే వారే లేరు. వారి వసతి, ఆరోగ్య భద్రతను గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొన్ని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ప్రమాదకర ప్రాంగణంలో పని చేయాల్సిన పరిస్థితిల్లో కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందినా ఫ్యాక్టరీ యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా ఆ విషయాలను తొక్కిపెట్టి వారి సొంత ఊర్లకు మృతదేహాన్ని పంపేసిన సందర్భాలు అనేకమున్నాయి. ఫ్యాక్టరీలు ప్రమాణాలను తుంగలో తొక్కుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కాలుష్యం స్థానికుల ఆరోగ్య భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఈ విషయమై కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులో లేరు.

శివయ్య సేవలో వేద విద్యార్థులు


శివయ్య చెంత వేదపారాయణం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: వేద విద్యార్థులు శనివారం శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. జనార్ధనంద సరస్వతి వేదవిద్వాన్ మహాసభలు ఆలయ సమీపంలోని భరద్వాజ తీర్థం గంగాసదన్‌లో జరుగుతున్నాయి. ఆదివారంతో ఈ సభలు ముగియనున్నాయి. శనివారం ఆ సంస్థ చైర్మన్ బ్రహ్మశ్రీ సాయినాథ్‌శర్మ, పశుపతి బ్రహ్మానంద శర్మ ఆధ్వర్యంలో వేదవిద్యార్థులు శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని, జ్ఞానాంబను దర్శించుకున్నారు. వేదపారాయణం చేస్తూ ఆలయం మొత్తం తిరిగారు. అనంతరం వారు మాట్లాడుతూ వేదపరిరక్షణకు వేదంలోని సారాన్ని ప్రజలకు తెలియజేయడానికి 15ఏళ్లుగా వేదమహాసభలు నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం ఒక క్షేత్రంలో ఈ వేదవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభల్లో వేదవిద్యను అభ్యసించే విద్యార్థులకు చేయూత ఇస్తామన్నారు. వారిలో ప్రతిభ గుర్తించి రాతపరీక్ష ద్వారా ధ్రువపత్రాలు అందజేస్తున్నామన్నారు. ఈ విద్యార్థులకు ఆలయాల్లో అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి దత్తాత్రేయశాస్త్రి, కుప్పా విశ్వనాథశర్మ, వెంపటి కుటుంబరామశాస్త్రి, కుప్పా నరసింహశర్మ, కుమార్‌శర్మ, జేవీరావు పాల్గొంటారని తెలిపారు.

రావణబ్రహ్మపై పరాశరేశ్వరస్వామి



పురవీధుల్లో ఊరేగుతున్న నటరాజస్వామి, రావణబ్రహ్మ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం సాయంత్రం రావబ్రహ్మ వాహనాన్ని ఉత్స మూర్తులు అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలు పూర్తి చేసి, శివగామీ సమేత నటరాజ స్వామి ఉత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవర్లు తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న నటరాజస్వామికి ఆస్థానం నిర్వహించారు. 11 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం స్వామివారి పరమ భక్తుడైన రావణబ్రహ్మ వాహనంపై పరాశరేశ్వరస్వామి అధిష్ఠించారు. సర్కారు హారతి అందుకున్న ఉత్సవర్లు పురవీధుల్లో విహరించగా మహిళలు కర్పూర హారతులు పట్టారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు.

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న


ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊయ్యాల సేవ నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్య పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామిని అధిష్టింపజేసి, ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. గంట పాటు నిర్వహించిన ఉయ్యాలసేవలో ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. వేద, నాద, గాత్ర కచేరీల మధ్య కొనసాగిన సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మురళీ కృష్ణ

శ్రీకాళహస్తి: నూతన ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సత్వరమే దృష్టి సారించి, విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి విఘాతం కలిగిస్తున్న జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం వర్తించేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, హరి, గోపాల్, చంద్రారెడ్డి, హేమకుమార్, భువనేశ్వరి, చెంచురాజు, మునస్వామి, ఉదయ్‌కుమార్, వెంకటముని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి


రేణిగుంట విమానాశ్రయంలో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయానికి సంబంధించి ప్రభుత్వపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అన్నారు. రేణిగుంట విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో శనివారం సాయంత్రం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన పలు అంశాలపై ఆయన జిల్లా జేసీ ధ్యానచంద్రతో కలిసి సమీక్షించారు. పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. విమానాశ్రయానికి కేటాయించిన పెండింగ్ భూసంబంధిత అంశాలపై, ఎలక్ట్రిక్ లైన్ వంటి పెండింగ్ అంశాలపై ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షించి, పరిష్కార దిశగా పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, కేఈఐ సంస్థ ప్రతినిధులు, జి సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎయిర్‌పోర్ట్ సివిల్, ఆపరేషనల్ అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్


దుర్భర స్థితిలో ఆర్టీసీ బస్టాండు

నాగలాపురం: మండలకేంద్రమైన నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అధ్వానంగా మారింది. బస్టాండ్ ఆవరణలో పలువురు బహిరంగంగా మలమూత్ర విసర్జన చేయడం, మందుబాబులు రాత్రివేళ మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు, తినుబండారాలు అక్కడే వదిలేసి వెళుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లో నిలబడడానికి ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ చుట్టూ ఆటోవాలాలు ఉంటున్నారు. ఇటీవల భారీ వర్షాలు పడడంతో నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా బురదమయంగా మారడంతో స్థానిక సర్పంచ్ చిన్నదొరై సుధా తన సొంత ఖర్చులతో గ్రావెల్‌తోలి జేసీబీతో చదును చేయించారు. ప్రయాణికులు బస్సు కోసం ఎండలో, వానలో వేచి ఉంటున్నారు. అంతేకాకుండా ఒక్క టి.పి.కోట మార్గంలో సత్యవేడు వెళ్లే బస్సులు తప్ప మిగతా బస్సులు బస్టాండ్ లోపలకు రావడం లేదు. బస్టాండు లోపల ప్రయాణికులు కూర్చోడానికి కుర్చీలు, ఫ్యాన్లు లేవు. ముఖ్యంగా తిరుమల–చెన్నై ఎక్స్‌ప్రెస్ బస్సులు నాగలాపురం లోపలకు రావడం లేదు. రాత్రి 11 గంటల సమయంలో మహిళలు, పిల్లలను బైపాస్ రోడ్డులోనే దింపేస్తున్నారు. దీనిపై పలుమార్లు తిరుమల డిపో మేనేజరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సంబంధిత డిపో అధికారులు దృష్టి పెట్టి నాగలాపురం ఆర్టీసీ బస్టాండు లోపలకు బస్సులు వచ్చేలా చూడాలని, అలాగే కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధి చెందిన శ్రీ సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ వారాహి అమ్మవారికి ఆషాఢ నవరాత్రులు సందర్భంగా విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 8వ రోజు శ్రీ వారాహి అమ్మవారికి పంచామృతాలు సమర్పించి, విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్ర రెడ్డి పూజల్లో పాల్గొన్న భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కార్తికేశన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తరలింపు


పాఠశాల భవనంలోని వస్తువులను తరలిస్తున్న గ్రామ కార్యదర్శి శివకుమార్


సచివాలయ వస్తుసామగ్రిని తరలించడంతో ఖాళీగా ఉన్న స్కూల్ గది

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల భవనంలో ఉన్న గ్రామ సచివాలయ కార్యాలయాన్ని శనివారం అధికారులు మరోచోటకు తరలించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ×పాఠశాల భవనంలో సచివాలయం₹ అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఎంఈఓ రవీంద్రనాథ్ స్పందించారు. దీంతో ఆయన వెంటనే గ్రామ కార్యదర్శి శివకుమార్, సిబ్బందితో చర్చించి పాఠశాలలోని సచివాలయ రికార్డులను తరలించేలా చేశారు. వస్తు సామగ్రిని జీఎన్ కండ్రిగ గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి తరలించారు. సచివాలయ భవనం పూర్తయ్యే వరకు అక్కడే సచివాలయాన్ని నిర్వహిస్తామని గ్రామకార్యదర్శి శివకుమార్ తెలిపారు. పాఠశాల భవనాన్ని ఖాళీ చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఎస్ నీరభ్‌కుమార్‌కు సాదర స్వాగతం


రేణిగుంట విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సీఎస్ నీరభ్‌కుమార్

రేణిగుంట: తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం 5.00 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ అతిథి సింగ్, డీఆర్వో పెంచల్ కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ల్యాండ్ అండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వరరావు, ఉదయ్‌భాస్కర్‌రాజు తదితరులు ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

శాస్త్రోక్తం.. పాండవ విద్యాభ్యాసం


పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులో ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం పాండవ విద్యాభ్యాసం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. పాండవ విద్యాభ్యాసం నాటకం తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. రాత్రి స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్‌హెచ్ఆర్సీ చొరవతో మృతదేహానికి పంచనామా


పోస్టుమార్టం నిర్వహించేందుకు వచ్చిన అధికారుల బృందం

శ్రీకాళహస్తి రూరల్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్సీ) చొరవతో శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరిలో శనివారం పోలీసులు, తహసీల్దార్ పర్యవేక్షణలో శవ పంచనామ నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. ఏప్రిల్ నెల 4వ తేదీన వెంకటగిరి మండలం ఉప్పరపల్లి మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాచగున్నేరికి చెందిన నాగమల్లి బత్తెయ్య(46)ను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు పోస్టుమార్టంపై అగాహన లేకపోవడంతో దహనక్రియలు పూర్తి చేశారు. కొద్దిరోజుల తర్వాత మరణ ధ్రువీకరణపత్రం కోసం సచివాలయానికి వెళ్లగా, సచివాలయ సిబ్బంది బత్తయ్య మృతికి సంబంధించి పోలీసు ఎఫ్ఐఆర్ కాపీ కావాలని తెలిపారు. దీంతో బాధితులకు ఏమి చేయాలో పాలుపోక శ్రీకాళహస్తిలోని జాతీయ మానవ హక్కుల సంక్షేమ సంస్థ ఏపీ ఇన్‌చార్జి రవీంద్రను సంప్రదించి పరిస్థితిని వివరించి తమకు న్యాయం జరిగేలా అండగా నిలవాలని కోరారు. దీంతో వారు వెంకటగిరి పోలీసు అధికారులకు విషయం వివరించడంతో వారు స్పందించి బత్తెయ్య మృతదేహానికి శవపంచనామా చేయాలని నిర్ణయించారు. దీంతో శనివారం అధికారుల బృందం శ్రీకాళహస్తి మండలంలోని కాపుగున్నేరికి రెవెన్యూ, పోలీసు, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వైద్య బృందం చేరుకుని శ్మశాన వాటికలో పూడ్చిన బత్తెయ్య మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు.

బాలికల చదువు దేశానికి సౌభాగ్యం


మామండూరులో విద్యార్థినులను సత్కరిస్తున్న ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ

రేణిగుంట: బాలికల చదువుతో దేశానికి సౌభాగ్యం సిద్ధిస్తుందని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ తెలిపారు. బెంగళూరుకు చెందిన క్రై సంస్థ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న 'పూరీ పఢాయీ దేశ్ కి భలాయి' కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మామండూరు, చైతన్యపురం, వెదుళ్లచెరువు, ఏఎస్ఆర్ కాలనీ గ్రామాల్లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన యువతులను ఘనంగా సత్కరించారు. వారికి విద్యాసామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుతోనే దేశ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతి అమ్మాయి కనీస విద్య ఇంటర్ పూర్తి చేయాలని, అప్పుడే వారికి జీవితంపై అవగాహన కలిగి, ఉన్నత స్థాయికి వెళతారని తెలిపారు. ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు వెళ్లి, తమ చదువు పూర్తి చేసుకున్నప్పుడే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, జయప్రకాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు మధుమతి, గంగమ్మ మల్లీశ్వరి, గంగమ్మ, రాధమ్మ ఆశ వర్కర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.